క్లుప్తంగా

బిషప్‌కు సన్మానం


బిషప్‌ను సన్మానిస్తున్న సంఘస్తులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం విచారణలో ఖమ్మం బిషప్ సగిలి ప్రకాష్ మొదటిసారిగా శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా బిషప్‌కు కోయచలక సంఘస్తులు మాజీ ఎంపీటీసీ బలుసుపాటి సుజాత తదితరులు ప్రత్యేక ప్రార్థన విన్నపం చదివారు. అనంతరం బిషప్‌ను కోయచలక–రేగులచలక సంఘస్తులు శాలువాతో సన్మానించారు.

టీజేఎస్ ప్లీనరీని జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: వచ్చే నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్లీనరీని జయప్రదం చేయాలని పలువురు నాయకులు కోరారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో జంగిపల్లి రవి మాట్లాడారు. అలాగే, ఖమ్మం జిల్లాలో వచ్చే నెల 10 నుంచి 20 వరకు టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బాబు, నాగేశ్వరరావు, సర్దార్, రామాచారి, శంకర్‌రావు, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత


వరంగల్ క్రాస్‌రోడ్ వద్ద గుంతను పూడ్చుతున్న పోలీసులు

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్, ఆటోనగర్, కోదాడ క్రాస్‌రోడ్ వరకు ఖమ్మం–సూర్యాపేట ప్రధాన రహదారిపై వర్షాలకు గుంతలు పడగా.. వాహనదారులు ఇబ్బందులు పడుతూ పలు ప్రమాదాలకు గురవుతున్నారు. దీన్ని గమనించిన రూరల్ పోలీసులు స్పందించి శుక్రవారం గుంతలను మట్టితో స్వయంగా పూడ్చి ప్రశంసలు అందుకున్నారు.

మా భూమిని ఇప్పించాలి

ఖమ్మంమామిళ్లగూడెం: వెలుగుమట్ల గ్రామపంచాయతీ పరిధిలోని 147, 148, 149 సర్వే నంబర్లలోని 31 ఎకరాలు 7 గుంటల భూమిని 27 మంది రైతులం సాగు చేసుకుంటున్నామని, తమ భూమి తమకు అప్పగించి.. పాస్ బుక్‌లు ఇవ్వాలని గ్రామపంచాయతీ పరిధిలోని రైతులు కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమకు వంశపారపర్యంగా సంక్రమించిన వ్యవసాయ భూమిలో కొంతమంది వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించుకుని మూడేళ్ల నుంచి తిష్ట వేశారని, తమ భూమి కోసం వెళితే కొందరిని ప్రేరేపించి తిట్టిస్తున్నారని పేర్కొన్నారు. తమ భూమిని తమకు ఇప్పించాలని కోరారు. ఈ సమావేశంలో బందెల వెంకన్న, బందెల కృష్ణ, షేక్ సొందు, షేక్ గోరేమియా, దోమల రాము, లకావత్తు నాగేశ్వరరావు, షేక్ సైదాబీ, షేక్ ఆశ, షేక్ జానీమియా, మద్దె నాగమణి, బుచ్చి రాములు, దుర్గారావు, రామస్వామి, మోతీరయ్య, వెంకటరత్నం, వీరస్వామి, రమ, రాజారావు, బి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ'కి ఎక్స్‌లెన్స్ గుర్తింపు



ధ్రువపత్రాలు అందుకుంటున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: అంతర్జాతీయ సంస్థ మాంగో డీబీ తమ కళాశాలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా గుర్తింపునిచ్చిందని ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో సంస్థ ప్రతినిధులు సంబంధిత ధ్రువపత్రాలను అందించారన్నారు. తమిళనాడుకు చెందిన ఐసీటీ అకాడమీ సహకారంతో నిర్వహించిన మాంగో డీబీ కోర్సులను తమ విద్యార్థులు మెరుగ్గా ఉపయోగించుకోవడంతో ఈ గుర్తింపు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, ఎన్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ సంస్థ బాధ్యులు బసవాదర్శన్, జగన్నాధన్, ఐసీటీ అకాడమీ సీఈఓ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సరిపోదా శనివారం
వినోద	అయ్
సాయిరాం	తంగలాన్
ఆదిత్య	మిస్టర్ బచ్చన్
శ్రీనివాస	అహో విక్రమార్క
సీఎన్ సినీ గెలాక్సీ	కమిటీ కుర్రోళ్లు, డిమాంట్ కాలనీ 2

- ఖమ్మంగాంధీచౌక్

'ఆపరేటర్ల' ప్రక్షాళన షురూ..?

కంప్యూటర్ ఆపరేటర్ల ప్రక్షాళనపై కదిలిన యంత్రాంగం

- విభాగాలను మార్చేందుకు ఫైల్ సిద్ధం
- ఖాళీగా ఉన్న వారి వివరాలను తెలుసుకున్న కమిషనర్
- సీనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన సుధాకర్



ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో కంప్యూటర్ ఆపరేటర్లపై వస్తున్న అనేక ఆరోపణల నేపథ్యాన ప్రక్షాళన చేసేందుకు కమిషనర్ అభిషేక్ అగస్త్య చర్యలకు ఉపక్రమించినట్లు తెలిసింది. ఎవరెక్కడ విధులు నిర్వర్తిస్తున్నారనే పూర్తి సమాచారాన్ని నివేదిక రూపంలో కమిషనర్ తన వద్దకు తెప్పించుకొని పరిశీలన చేసినట్లు సమాచారం. ఖాళీగా ఉన్న వారి పేర్లు, ప్రస్తుతం ఎవరు ఏ విభాగంలో పని చేస్తున్నారన్న వివరాలను తెలుసుకున్నారన్న చర్చ కేఎంసీలో జరుగుతుంది. ఇంజనీరింగ్, రెవెన్యూ, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, గ్రీవెన్స్, జనన, మరణ ధ్రువీకరణ, పెన్షన్ విభాగాల్లో ప్రస్తుతం పని చేస్తున్న వారిని అక్కడ నుంచి వేరే విభాగాలకు కేటాయించే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఏ విభాగాల్లో పని చేయకుండా ఖాళీగా ఉంటున్న వారిని ఎక్కడ సర్దుబాటు చేయాలి, విధుల్లో కొనసాగించాలా..? వద్దా..? అనే ఆలోచన చేస్తున్నట్లు చర్చ జరుగుతుంది. ఐటీ విభాగంలో ఉన్న వారిని పూర్తిగా అక్కడ నుంచి తొలగించి, ఇతర విభాగాలకు కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే ఇందుకు సంబంధించి అధికారులు ఫైళ్లు సిద్ధం చేసి కమిషనర్ వద్దకు పంపించడంతో సోమవారం నాటికి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి కొత్త విభాగాల్లోకి కంప్యూటర్ ఆపరేటర్లను మార్చుతూ కార్యాలయ ఉత్తర్వులు వెలువరిస్తారనే చర్చ కొనసాగుతుంది.

డ్రాయింగ్ బ్రాంచ్‌పై తాత్సారమేల?..

కాగా, అన్ని విభాగాలపై దృష్టి సారిస్తున్న అధికారులు ఇంజనీరింగ్ విభాగంలో కీలకమైన డ్రాయింగ్ బ్రాంచ్‌ను ప్రక్షాళన చేయడం లేదని, ఒకరిద్దరు అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఏళ్ల తరబడి అక్కడే పాతుకుపోయి అంతా తామై నడిపిస్తున్నారని, వీరిని ఎందుకు కదిలించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అర్హత లేకున్నా.. ఫేక్ సర్టిఫికెట్లతో డ్రాయింగ్ బ్రాంచ్‌లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విభాగంపైన అధికారులు దృష్టి సారించాలని రెగ్యులర్ ఉద్యోగులు కోరుతున్నారు.

విధుల్లో చేరిన సీనియర్ అసిస్టెంట్..

వర్క్ అరెంజ్‌మెంట్ కింద ఇద్దరు సినియర్ అసిస్టెంట్లను పరస్పర బదిలీ చేస్తూ సీడీఎంఏ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ నుంచి సీనియర్ అసిస్టెంట్ ఎ.సుధాకర్‌ను కేఎంసీ కార్యాలయానికి బదిలీ చేయగా, ఇక్కడ పని చేసిన రమేష్‌ను వరంగల్ కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరో ఉత్తర్వులు వచ్చే వరకు వీరు బదిలీ అయిన స్థానాల్లో విధులు కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ శుక్రవారం కేఎంసీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు.

డంపింగ్‌యార్డును పరిశీలించిన కమిషనర్

సాక్షి ఎఫెక్ట్..


డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని దానవాయిగూడెంలో ఉన్న డంపింగ్‌యార్డును మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సందర్శించారు. 'సాక్షి'లో శుక్రవారం 'డంపింగ్‌యార్డు నుంచి దుర్వాసన' శీర్షికతో కథనం ప్రచురితం కాగా స్పందించిన కమిషనర్ డంపింగ్‌యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బయోమైనింగ్ వేగవంతం చేయాలని, వర్షాలు తగ్గిన వెంటనే డంపింగ్‌యార్డులో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కంపోస్ట్ ఎరువు తయారీని ప్రారంభించాలని, ఇందుకోసం పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించేలా చూడాలన్నారు.

డివిజన్లలో పర్యటన..

శానిటేషన్ విజిట్‌లో భాగంగా మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య 37, 45 డివిజన్లలో పర్యటించారు. వినోద థియేటర్ రోడ్డు, పోస్ట్ ఆఫీస్ రోడ్డు, పాత బస్టాండ్ వెళ్లే దారిని పరిశీలించి అక్కడి శానిటేషన్ సిబ్బందితో మాట్లాడారు. కాల్వ శుభ్రం చేసిన ప్రదేశంలోని షాప్ ఓనర్లతో సంతకాలు సేకరించి చెత్తను తీసివేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఓ బార్ సందులో పర్యటిస్తుండగా అక్కడ కాల్వలో ప్లాస్టిక్ గ్లాసులను చూసి బార్ యజమానితో పాటు షాపుల్లో తనిఖీలు చేసి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడుతున్న వారికి ఫైన్ విధించాలని శానిటరీ సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. దీంతో తనిఖీ చేయగా.. రూ.3వేల విలువ చేసే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గ్లాసులు రికవరీ చేసి రూ.2 వేలు జరిమానా విధించారు. ఈ రైడ్‌లో శానిటరీ సూపర్ వైజర్ సాంబయ్య, ఎస్ఐలు మల్లయ్య, శీను పాల్గొన్నారు.

6న బహిరంగ వేలం

ఖమ్మం నగర పాలక సంస్థకు చెందిన గది, ఫుట్‌బాల్ కోర్టుకు సంబంధించి వచ్చేనెల 6న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఒక ప్రకటనలో తెలిపారు. లకారం ట్యాంక్ బండ్ వద్ద తీగల బ్రిడ్జి పక్కన ఉన్న పెద్ద కమర్షియల్ గది, శ్రీరామచంద్రయ్యనగర్‌లోని ఎస్‌బీఐటీ రోడ్డులో గల ఫుట్‌బాల్ కోర్టులకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నెలసరి అద్దెపై మూడేళ్ల పాటు కేటాయించనుండగా.. వేలం సాయంత్రం 4 గంటలకు ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు ధరావత్ సొమ్ముగా రూ.20వేలు చెల్లించాలని, వేలం పాట దక్కించుకున్న వారు రూ.లక్ష సెక్యూరిటీ డిపాజిట్, మూడు నెలల కిరాయి చెల్లించాలని వివరించారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

ఖమ్మంమామిళ్లగూడెం: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నేత తాండ్ర వినోద్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 2న ప్రధాని నరేంద్ర మోదీ ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని జిల్లా కేంద్రంలో 4న, ప్రతీ మండల కేంద్రంలో 5న కార్యక్రమాలను ప్రారంభించాలన్నారు. ఎవరైనా బీజేపీ కుటుంబంలో సభ్యులుగా చేరాలంటే 8800002024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని, పార్టీ జిల్లా అధ్యక్షుడి సహకారంతో ప్రతీ బూత్ స్థాయిలో సభ్యత్వ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సన్నె ఉదయ్‌ప్రతాప్, ఖమ్మం అసెంబ్లీ సభ్యత్వ ప్రముఖ్ మంద సరస్వతి, నాయకులు రుద్ర ప్రదీప్, దనియాకుల వెంకటనారాయణ, ఏపూరి నాగేశ్వరావు, మార్తి వీరభద్ర ప్రసాద్, దాసరి మధు, కంపసాటి అంజన్న, రుద్రగాని మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ఖమ్మంరూరల్: మండలంలోని పడమటితండాలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యుడు అనంతు హరీష్ ఆవులు, గొర్రెలు, మేకలకు చర్మవ్యాధి, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. పశువులకు సీజనల్ వ్యాధులైన గురక, జబ్బవాపు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండగా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది ఎండీ. ఖాజాపాషా, వి.రామారావు, హుస్సేన్, సందీప్, జె.వెంకటేశ్వర్లు, శ్రీను, వినయ్ వీరబాబు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి


కామేపల్లి/నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా జరుపుకోవాలని పోలీస్ అధికారులు గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం ఆయా పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో కామేపల్లిలో సీఐ తిరుపతిరెడ్డి, నేలకొండపల్లిలో సీఐ సంజీవ్, తిరుమలాయపాలెంలో ఎస్సై కూచిపూడి జగదీష్‌లు పలు సూచనలు చేశారు. గణేష్ మండపాలకు, మైక్ ఏర్పాటుకు పర్మిషన్ తీసుకోవాలని, నిమజ్జనం తర్వాత డీజేలకు అనుమతిలేదని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా మండపాలు ఏర్పాటు చేసుకుని భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సైలు పి.సంతోష్, సాయికుమార్, ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడులో టీజీఎస్ఆర్టీసీ కార్గో లాజిస్టిక్స్ సేవలను శుక్రవారం పవర్ గ్రిడ్ చీఫ్ మేనేజర్ ఎ.పవన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు పార్సిళ్లు చేరవేసేందుకు వ్యాపారులు, రైతులు, ప్రజలు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూడిదంపాడు ఏజెంట్ గౌస్, లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్స్ కె.హరి వర్మ, బి.వీరభద్రం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన


గుంటు మల్లన్న ఆలయంలో కుంకుమార్చన


ఖమ్మంగాంధీచౌక్: శ్రీ రామకృష్ణ విద్యాలయంలో..

శ్రావణమాసంలో నాల్గవ శుక్రవారం కావడంతో ఆలయాలు, విద్యాలయాల్లో మహిళలు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా అర్చకులు మహిళలచే కుంకుమార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

కేంద్రమంత్రికి కార్పొరేటర్ వినతి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ శుక్రవారం కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం సహాయక మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. నగరంలో పార్టీ తరఫున కార్పొరేటర్‌గా తానేనని చెబుతూ.. డివిజన్ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం వివిధ అంశాలతో కూడినవినతిపత్రాన్ని అందించగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

కలెక్టర్‌కు..


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపచేయాలని భారతి కిసాన్ సంఘ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మందనపు రామారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి ఇప్పుడు షరతులు విధించడం దుర్మార్గమన్నారు. సమస్యలను వెంటనే పరిష్కారించాలని కోరారు. వినతి అందించిన వారిలో జిల్లా నాయకులు మల్లంపాటి రమేష్, సాము నరేష్, పగడవరకు శ్రీను, మురళి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన దేవాదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు కలెక్టర్ ముజిమ్మల్ ఖాన్‌ను గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి, దేవాలయాల కార్యనిర్వాహణ అధికారులు కొత్తూరు జగన్మోహన్‌రావు, వీవీ నర్సింహారావు, శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, అర్చక సంఘ ప్రతినిధి దాములూరి వీరభద్రరావు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంరూరల్: మండలంలోని సాయిగణేష్‌నగర్‌లో గల క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కల్లెం వెంకటరెడ్డి, పార్టీ నాయకుడు హరినాథబాబులు లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 55మందికి సుమారు రూ.22 లక్షల విలువైన చెక్కులు మంజూరైనట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్ది వీరారెడ్డి, బోడా వెంకన్న, ఏనుగు వెంకట్‌రెడ్డి, దండ్యాల బాబు, తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వెంపటి రవి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్

కూసుమంచి: మండల తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీంచి ధరణి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేగొమ్మ గ్రామంలో ప్రభుత్వ భూమి సర్వేపై ఆర్డీఓ గణేష్, తహసీల్దార్ సురేష్‌కుమార్‌తో చర్చించారు. సర్వే విధివిధాలను అడిగి తెలుసుకుని సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ సర్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధే లక్ష్యం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నగర సమగ్రాభివృద్ధే తన ముందున్న లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం 18వ డివిజన్‌లో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1.35 కోట్లతో నిర్మించనున్న స్ట్రోమ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ మందడపు లక్ష్మీమనోహర్‌రావు, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, పాలెపు వెంకటరమణ, ఎండీ ఖాదర్‌బాబా, తుపాకుల శ్రీను, ప్రతిభారెడ్డి, బాణాల లక్ష్మణ్, పాలకుర్తి నాగేశ్వరరావు, కూరపాటి ఉదయ్, చిలుకూరి ఉపేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు. కాగా, నేడు(శనివారం) 35వ డివిజన్ బురదరాఘవాపురంలో స్ట్రోమ్ వాటర్ డ్రెయిన్, సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు.

పెసళ్లు మొత్తం ప్రభుత్వమే కొనాలి


పెసళ్లను పరిశీలిస్తున్న ఏఐపీకేఎస్ ప్రతినిధి బృందం

ఖమ్మంవ్యవసాయం: రైతులు పండించిన పెసలు మొత్తాన్ని ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కమిటీ(ఏఐపీకేఎస్) డిమాండ్ చేసింది. రైతు సంఘం ప్రతినిధి బృందం శుక్రవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పెసల కొనుగోళ్లను పరిశీలించింది.ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు లేకపోవడంతో వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి రైతులను ధరలో దగా చేశారని ప్రతినిధులు ఆరోపించారు. ప్రభుత్వం ఖమ్మం మార్కెట్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి శ్యాంపిళ్లను పరిశీలించిందే తప్పా కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలను పరీక్షించే యంత్రాలు సక్రమంగా లేవని దీంతో తేమశాతం తప్పుడుగా చూపుతున్నాయని పేర్కొన్నారు. మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, కోలేటి నాగేశ్వరరావు, కేలోత్ లక్ష్మణ్, నాగరోగు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా బాధితులకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలి

తిరుమలాయపాలెం: ఫైలేరియాతో బాధపడుతున్న వారికి నెలకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు సి.వై పుల్లయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధకాలు బాధితులకు చాలీచాలని పెన్షన్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి నెలకు రూ.10వేల పెన్షన్‌తో పాటు ఉచిత మందులు, దోమ తెరలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మొదలైన మండలస్థాయి క్రీడలు

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రీడా పోటీలను బోదులబండ మాజీ ఎంపీటీసీ కట్టెకోల సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.మండల విద్యాశాఖాధికారి రాములు, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

సమీకృత గురుకులం ఏర్పాటు చేయాలి

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల క్రాస్ రోడ్డులో సమీకృత గురుకులం ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, జిల్లా నాయకుడు కర్నాటి అశ్వనికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామేపల్లిలో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న 30 సమీకృత గురుకులాలలో ఒకటి కామేపల్లి, కారేపల్లి, ఏన్కూర్, రఘునాథపాలెం మండలాలను కలిపి ముచ్చర్ల క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అత్యంత వెనకబడిన ప్రాంతమైన కామేపల్లి, కారేపల్లి ఉన్నాయని,ఈ ప్రాంతానికి సమీకృత గురుకులాన్ని కేటాయించి పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని ఆరెగూడెంకు చెందిన రాంబాబు శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆయన ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

పెద్దాస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి


మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని పెద్దాస్పత్రిలో నెలల తరబడిగా శానిటరీ పైపులు లీకుల ఏర్పడి దుర్వాసన వస్తున్నా.. పట్టించుకోకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు మందా సురేష్‌లు విమర్శించారు. శుక్రవారం ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఎదుట పీవైఎల్, పీఓడబ్ల్యూ సంయుక్త ఆధ్వర్యాన శుక్రవారం ధర్నా నిర్వహించగా.. వారు మాట్లాడారు. లేబర్ రూమ్ నుంచి మొదలుకొని ఆపరేషన్ థియేటర్, రెండు ఫ్లోర్ల బాత్రూంలు మొత్తం బ్లాక్ అయి కంపు కొడుతున్నాయని, దీంతో మెయిన్ గేట్ మూసేశారే తప్ప బాగుచేయలేదని మండిపడ్డారు. ఓపీ డాక్టర్ రూమ్‌లు, పీడియాట్రిక్ విభాగాల్లో ఉండే హ్యాండ్ వాష్ సింక్‌లు కూడా లీక్ అయ్యాయని, వైద్యం కోసం ఆస్పత్రికి వస్తే ఉన్న రోగాలు పోయి కొత్త రోగాలు వచ్చే ప్రమాదం ఉందని ఎద్దేవా చేశారు. టీహబ్‌లో రేడియాలజిస్ట్ లేక స్కానింగ్ కోసం ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సివస్తుందని, మందులు, వైద్య సిబ్బంది కూడా సరిపడా లేదవన్నారు. జిల్లాలో ముగ్గురు మినిస్టర్లు ఉన్నా.. పెద్దాస్పత్రిలో సేవలు మెరుగుపడడం లేదని వారు విమర్శించారు. తక్షణమే ఆస్పత్రిలో నెలకొన్న శానిటరీ, శానిటైజర్ సమస్యలను పరిష్కరించాలని, వైద్య పోస్టులు భర్తీ చేయాలని, జ్వరాలపై వైద్య సిబ్బంది అప్రమత్తం కావాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల మంగతాయి, పీఓడబ్ల్యూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు ఝాన్సీ, జిల్లా సహాయ కార్యదర్శి శోభ, పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి భరత్, జిల్లా నాయకులు చందు, నగర కార్యదర్శి రవీందర్, అశోక్, జడ మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, చందు, వనిత, సింధు, అంజలి, సత్తార్ పాల్గొన్నారు.

లింకులు లేక..!



నగరంలో డ్రెయినేజీలు నిర్మిస్తున్నప్పటికీ వాటికి లింక్‌లు మాత్రం నిర్మించడం లేదు. 4వ డివిజన్‌లోని ఊరచెరువు పక్క బజారులో డ్రెయినేజీలు నిర్మించారు. కానీ, ఈ డ్రెయినేజీల ద్వారా వచ్చే మురుగునీరు బయటకు వెళ్లేలా లింక్ డ్రెయిన్లు ఏర్పాటు చేయకపోవడంతో ఖాళీ స్థలాల్లోకి ఇదిగో ఇలా వచ్చి చేరుతోంది. దీంతో ఇళ్ల మధ్యలో మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడేలా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్